క్లుప్తంగా

రేపు మెగా వైద్య శిబిరం

రంగంపేట: నల్లమిల్లి గ్రామంలోని స్కిన్నర్ గార్డెన్‌లో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు బిక్కవోలు చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పిడి జాన్‌డేన్ తెలిపారు. ఆయన శనివారం సాయంత్రం మాట్లాడుతూ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి శామ్యూల్ రాజు జ్ఞాపకార్థం ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దంత, కంటి, జనరల్, స్త్రీ వైద్య నిపుణులు వివిధ పరీక్షలు చేసి మందులు అందిస్తారన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ కూడా చేస్తారని తెలిపారు. పలు రకాల రక్త పరీక్షలను అతి తక్కువ ధరలకే చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

కోరుకొండ: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని భూ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. పెద్దాడ గ్రామ పంచాయతీ పక్కనే గల పంచాయతీ స్థలంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయం వద్ద ఆహ్లాదకరమైన మొక్కలు నాటటంతో పాటు వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మన్యం శ్రీనివాసరావు చౌదరి, సచివాలయ అధికారులు వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న గంగిరెడ్డి

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలోని పేదలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామంలోని సత్తి గంగిరెడ్డి తన తండ్రి వీర్రాఘవరెడ్డి జయంతిని పురస్కరించుకుని మహిళలకు చీరలు, పురుషులకు దుస్తులు అందించారు. అలాగే భోజనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలోని కొవ్వూరి గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు



సారా నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈలకొలను గ్రామంలో శనివారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ దాడులలో పేరూరి నాగన్న, కోట బూరయ్యలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 20 లీటర్ల సారా, మోటారు సైకిల్, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

యువకుడి అదృశ్యం

సీతానగరం: వంగలపూడికి చెందిన పల్లప్రోలు వెంకట దుర్గా ప్రసాద్ కనిపించడం లేదని, అతడి చిన్నాన్న శివ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు సీతానగరం డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్లు తీసుకోవాలని తెలిపి వెళ్లిన వెంకట దుర్గా ప్రసాద్ తిరిగి ఇంటికి రాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమంగా గోవుల తరలింపు

రాజానగరం: అక్రమంగా ఆవులను తరలిస్తున్న వ్యాన్‌ను శనివారం జాతీయ రహదారిపై జీఎస్ఎల్ వైద్య కళాశాల సమీపంలో స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పార్వతీపురం నుంచి హనుమాన్ జంక్షన్‌కు ఆవులను తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్సై నాగార్జున, సిబ్బందితో కలసి రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. వారిని చూసి, వ్యాన్‌ను ఆపి డ్రైవర్ పరారయ్యే ప్రయత్నం చేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని పట్టుకుని విచారణ చేశారు. ఏ విధమైన అనుమతి పత్రాలు, వైద్యుని ధ్రువీకరణ పత్రాలు లేకుండా వ్యాన్‌లో తరలిస్తున్న 20 ఆవులను, 36 ఆవు దూడలను స్వాధీనం చేసుకుని, వాటిని గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నిజమేనండీ.. ఇది రోడ్డే..



బురదమయంగా మారిన గణేష్ నగర్ మట్టి రోడ్డు

కోరుకొండ: కాపవరం పంచాయతీ పరిధిలోని గణేష్ నగర్ రోడ్డు అధ్వానంగా మారింది. గోతుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే మట్టి దారి, పైగా వర్షాలు కురవడంతో బురదమయంగా తయారైంది. దీంతో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ నివసించే వారందరూ వ్యవసాయ కూలీలే. రోజూ ఉదయాన్నే క్యారేజీలు పట్టుకుని పనికి వెళ్లిపోతారు. సమీపంలోని ఇటుక బట్టీలు, సామిల్లులు, రైసమిల్లుల్లో పనులు చేసుకుంటూ ఉంటారు. ఈ ప్రాంతంలో సుమారు 150 నివాస గృహాలు ఉన్నాయి. వాటితో దాదాపు 600 మంది నివసిస్తున్నారు. వర్షాకాలంలో మోకాలిలోతు బురదలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్యపై పలు సందర్భాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది.

తాళం తీసేదెప్పుడో?

- ముగ్గళ్లలో నిరుపయోగంగా హెల్త్ సెంటర్
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- చిన్న లోపాలు చూపి సెంటర్‌కు తాళాలు

సీతానగరం: ప్రజల ఆరోగ్యం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముగ్గళ్ల గ్రామంలో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ సెంటర్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) ప్రస్తుతంగా నిరుపయోగంగా మారింది. ఈ కేంద్రంలో అన్ని సదుపాయాలు ఉనప్పటికీ, వైద్య ఆరోగ్య సిబ్బంది చిన్న చిన్న లోపాలు చూపి తాళం వేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ భవనం నిర్మించి, ప్రారంభించినా, దానిలో సేవలు అందించడానికి వైద్య, ఆరోగ్య సిబ్బంది ససేమిరా అంటున్నారు. దీనితో లక్షల రూపాయల వ్యయంతో నెలకొల్పిన ఈ భవనం నిరుపయోగంగా మారింది.

రూ.21 లక్షలతో భవన నిర్మాణం

వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్లె ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం కోసం ముగ్గళ్లలో రూ.21 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్యసేవలు అందించడానికి గది, సిబ్బంది ఉండటానికి గది, వంటగది, అటాచ్ మరుగుదొడ్లు నిర్మించారు. లైట్లు, ఫ్యాన్లతో పాటు నీటి సదుపాయానికి ట్యాపులు, పైప్‌లైన్లు తదితర సకల సౌకర్యాలు కల్పించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముగ్గళ్లలోని హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. అయితే ఎలక్షన్ కోడ్ రావడంతో విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. అయితే ఇటీవల విద్యుత్ కనెక్షన్ ఇచ్చినా తాళం తీయకుండా వదిలేశారు.

ప్రజల ఇబ్బందులు

ప్రజలకు వైద్య సేవలు అందించడానికి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఉండాలి. అలాగే ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యసేవలు అందించాలి. బీపీ, సుగర్, రక్త పరీక్షలు, హెచ్ఐవీ పరీక్షలు జరపాలి. అవసరమైన వారికి మందులు అందజేయాలి. అయితే కేంద్రంలో అన్ని వసతులు ఉన్నా తెరవకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విలేజ్ హెల్త్ సెంటర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చినా, దానిలో వైద్యసేవలు అందించడానికి వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పలు సాకులు చూపి సెంటర్‌కు తాళం వేశారు.



ముగ్గళ్లలో నిరుపయోగంగా వదిలేసిన విలేజ్ హెల్త్ క్లినిక్

వైద్య సేవలు అందించాలి



గత ఏడాదిలోనే ముగ్గళ్లలోని హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇటీవల విద్యుత్ కనెక్షన్ ఇచ్చినా భవనానికి వేసిన తాళం తీయలేదు. దీంతో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే, వైద్య సిబ్బంది కోసం గ్రామంలో తిరగాల్సి వస్తోంది. ఈ క్లినిక్‌లో వైద్య సేవలు అందించడానికి ఎందుకు ఇష్టపడడం లేదో తెలియదు. ఏవో వంకలు చెప్పి, సెంటర్‌కు తాళం వేసి ఉంచుతున్నారు.

– ఈతకోట వెంకట్, ముగ్గళ్ల

అధికారులు స్పందించాలి



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ప్రజలకు వైద్యసేవలు అందించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.లక్షల నిధులతో ఈ సెంటర్ ఏర్పాటు చేశారు. కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించారు. ఇంకా ఏమైనా అవసరమైతే పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలి.

– గుర్రాల జ్యోత్స్న, ఎంపీపీ, ముగ్గళ్ల

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామ సచివాలయం కార్యదర్శులు, ఆరోగ్యశాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కె.నరేంద్ర రెడ్డి అన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నరేంద్ర రెడ్డి, ఇతర అధికారులు శనివారం పాల్గొన్నారు. అనంతరం నరేంద్రరెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల రాకుండా గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు మెరుగుపర్చాలన్నారు. వాటిపై అధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. పీ–4 బంగారు కుటుంబం, మార్గదర్శి కార్యక్రమంలో భాగంగా పేద కుటుంబాలను సమాజంలో ఉన్నత స్థానాల వ్యక్తులు, పలు సంస్థలు దత్తత తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణ రెడ్డి, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీతానగరం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

సీతానగరం: సీజనల్ వ్యాధులపై వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆ ఆస్పత్రి ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. శ్లాబ్ నుంచి వర్షం నీరు లీకేజీ అవుతుందని, ఎలక్ట్రిక్ వైరింగ్ పాడైపోయిందని గుర్తించారు. ఈ విషయాన్ని కలెక్టర్, వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం సీతానగరం–2 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించారు. ఆయన వెంట జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ రాజీవ్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ శైలజా రాణి, సీసీ బి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సైనికుల త్యాగం స్ఫూర్తిదాయకం

రంగంపేట: భారత సైనికుల త్యాగం, ధైర్యం అందరికీ స్ఫూర్తిదాయకమని బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మండవిల్లి గుప్తా అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల బీజేపీ ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ భారత సైన్యం పాకిస్తాన్‌పై విజయం సాధించిన దానికి గుర్తుగా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరాం మాట్లాడుతూ దేశ బలానికి, సహనానికి కార్గిల్ విజయగాథ నిదర్శనమన్నారు. విద్యార్థులందరూ దేశభక్తిని కలిగి ఉండాలన్నారు.

పచ్చిరొట్టతో భూమికి సారం



గుమ్ములూరులో పచ్చిరొట్టను నేలలో కలిపి దున్నిన రైతులు

కోరుకొండ: మెట్ట ప్రాంతమైన కోరుకొండ మండలంలో రైతులు పచ్చిరొట్టను కలియదున్నే పనులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయశాఖాధికారులు, శాస్త్రవేత్తల సలహా మేరకు భూసారాన్ని పెంచడానికి, గతంలో కంటే దిగుబడి పెరగడానికి చర్యలు చేపట్టారు. పచ్చిరొట్ట ఎరువు ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయి. భూమి సారవంతంగా మారడంతో దిగుబడి బాగుంటుంది. దీంతో పలు మెట్ట ప్రాంత గ్రామాల్లో పచ్చిరొట్టను పెంచుతున్నారు. రొట్ట వేసిన 45 రోజుల తర్వాత దాన్ని నేలలో కలియదున్నుతారు. తద్వారా పంటలకు ఎరువుగా ఉపయోగపడుతుంది. మండలంలోని 22 గ్రామాల్లోని పలువురు రైతులు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు.

మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు దారుణం

- రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలన్న మంత్రి అచ్చెన్నాయుడు బేషరతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో కూటమి నాయకులు ప్రజలను దగా చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ముందే చెప్పారన్నారు. కూటమి మంత్రి కింజారపు అచ్చెన్నాయుడి వ్యాఖ్యలతో ఆ విషయం నిజమని రుజువైందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 45 నుంచి 60 ఏళ్లున్న ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళకు చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 అందజేశామని అలాగే కాపు, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య తదితర అగ్రవర్ణ మహిళలకు కాపు నేస్తం, ఈ–బీసీ నేస్తం తదితర పథకాల ద్వారా ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందించడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇంటి పట్టా ఇచ్చామన్నారు. అమ్మఒడి, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను నేరుగా మహిళల ఖాతాలకు జమ చేశామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం పథకాలను ఇవ్వడానికి మనసు రాక, సాకులు వెతుక్కుంటోందన్నారు. రాష్ట్ర చరిత్రలో అచ్చెన్నాయుడిలా బేల వ్యాఖ్యలు చేసిన మంత్రి ఇప్పటి వరకు ఎవరు లేరన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అనపర్తి ఫొటో అండ్ వీడియో రిలేటెడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

అనపర్తి: స్థానిక రజక కమ్యూనిటీ హాల్లో శనివారం అనపర్తి ఫొటో అండ్ వీడియో రిలేటెడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడు ఎన్.గోపీకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.నాగేశ్వరరావు(సంతోష్ స్టూడియో), వి.సుబ్రహ్మణ్యంరాజు (భాను వీడియో), ఉపాధ్యక్షులుగా డి.గంగాధర్ (శ్రీరస్తు స్టూడియో), సంయుక్త కార్యదర్శిగా నాగు (కేవీఆర్ స్టూడియో), కోశాధికారిగా బి.రవికుమార్ (రవి ఫొటోగ్రఫీ), సంయుక్త కోశాధికారిగా ఎస్.సత్యానందం (సత్య స్టూడియో), సహాయ కార్యదర్శులుగా ఎస్.పూర్ణ చంద్రారెడ్డి (వెంకీ స్టూడియో), ఎం.సత్తిబాబు (శ్యామ్ స్టూడియో), కె.శ్యామ్ (సత్యదుర్గ స్టూడియో), వి.రమేష్ (పిజి డిజిటల్స్), వి.అయ్యప్ప (అయ్యప్ప స్టూడియో), మణి ఎంపికయ్యారు.

క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఇషాజ్యోతి

అనపర్తి: క్షయవ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా క్షయ నివారణ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఇషా జ్యోతి అన్నారు. అనపర్తి సచివాలయం–4లో శనివారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ సోకిన వారికి సాధారణంగా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం కలిగి ఉండి ఆకలి మందగించడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒకవేళ నిర్ధారణ అయితే ఆ రోగికి ఆరు నెలల పాటు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. అలాగే పోషకాహారం కోసం నెలకు రూ.1000 అతడి బ్యాంకు ఖాతాకు జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది సీహెచ్‌వీ లక్ష్మి, బి.నిర్మల, కె.మణి, జె.నీలిమ, వి.రాజకుమారి, టి.అనురాధ, టీబీ సూపర్ వైజర్ మహేష్‌బాబు, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికపై అవగాహన పెంచుకోవాలి

రాజానగరం: కాలానికి అనుగుణంగా మారుతున్న సాంకేతికపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని అధ్యాపకులు, విద్యార్థులకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి సూచించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ ఏఐ అండ్ ఎంఎల్.. ఇన్ ది సెన్సార్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ డిజైన్' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో అన్ని రంగాలలోనూ సాంకేతిక వినియోగం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో అందరూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్‌కు ఉన్న ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రీసోర్స్‌పర్సన్‌గా ఎన్ఐటీ వరంగల్ బయోటెక్నాలజీ అధ్యాపకుడు డాక్టర్ పి.శ్యామ్ వ్యవహరించారు. అలాగే కన్వీనర్‌గా డి.కిషోర్, కో కన్వీనర్లుగా జె.హనుమంతు, డాక్టర్ డి.శ్రీనివాసరావు వ్యవహరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి. వెంకటేశ్వర్రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెండి రుద్రాక్ష మాల సమర్పణ



వెండి రుద్రాక్ష మాలను అందిస్తున్న దాత

బిక్కవోలు: స్థానిక శ్రీలక్ష్మీ గణపతి ఆలయానికి హైదరాబాద్ చెందిన ఉండి నాగధర్ 500 గ్రాముల వెండి రుద్రాక్ష మాల అందించారు. ఆ మాలను శనివారం ఆలయ సిబ్బంది కోళ్ల వీరకుమార్, నామాల ప్రసాద్ సమక్షంతో అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసినట్టు ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు.

జాబ్‌మేళాలో పలువురికి ఉద్యోగాలు

సీటీఆర్ఐ: ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జాబ్ మేళాలలో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం అన్నారు. సెంటర్ ఫర్ ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్, ఆర్జీ టెక్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు జాబ్‌మేళా నిర్వహించారు. ఆర్జీ టెక్ కంపెనీ ప్రతినిధులు పోలుబోతు రమాకాంత్, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలకు చెందిన 40 మందికి పైగా విద్యార్థులు వీటికి హాజరయ్యారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.స్వర్ణశ్రీ, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పీవీబీ సంజీవరావు, జి.శరత్ బాబు, డి.మధులత పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనపర్తి: కొత్తూరు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో 2025–26 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాజు శనివారం ప్రకటనలో తెలిపారు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో ఎస్టీ–2, బీసీ–2, ఎస్సీ–5 ఖాళీలు ఉన్నాయని, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో ఎస్సీ–2, బీసీ–2, ఎస్టీ–2, బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ఎస్సీ–27, బీసీ–2, ఎస్టీ–5, బీసీ(సీ)–4, ఓసీ–1 సీటు అందుబాటులో ఉందన్నారు. ఆసక్తి కలిగిన వారు సోమవారం నేరుగా కళాశాలలో సంప్రదించాలన్నారు.

పేకాట శిబిరంపై దాడి

అనపర్తి: మండలంలోని రామవరం గ్రామంలో జరుగుతున్న పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం రాత్రి జరిగిన ఈ దాడిలో 27 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. అలాగే 18 మోటారు సైకిళ్లు, ఆరు కార్లను కూడా సీజ్ చేశారు. కాగా.. ఈ ఘటనపై వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అందుబాటులో లేరు.

పాఠశాలకు వితరణ

రాజమహేంద్రవరం సిటీ: చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక గాంధీపురం–2లోని సుంకర భాస్కర రావు నగర పాలక ఉన్నత పాఠశాలకు శనివారం పలు వస్తువులు అందజేశారు. ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాల నాగు బలేష్ గుప్తా, ఉపాధ్యక్షులు యియ్యపు మురళీధర్, మద్దుల మురళీకృష్ణ చేతుల మీదుగా సుమారు రూ.50 వేలు విలువైన పది టేబుళ్లు, పది కుర్చీలు వితరణ చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఆలయానికి ఇన్వర్టర్ అందజేత



గణపతి ఆలయానికి ఇన్వర్టర్, బ్యాటరీ అందిస్తున్న దాత వెంకటేశ్వరరావు

బిక్కవోలు: స్థానిక శ్రీలక్ష్మీ గణపతి ఆలయానికి గ్రామానికి చెందిన లక్ష్మీగణపతి కిరాణా జనరల్ స్టోర్స్ ప్రొప్రైటర్ దిగవల్లి వెంకటేశ్వరరావు శనివారం రూ.22 వేలు విలువైన ఇన్వర్టర్, బ్యాటరీ అందజేశారు. ఈ విషయాన్ని ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. వాటిని ఆలయ సిబ్బంది నామాల ప్రసాద్, కోళ్ల వీర కుమార్‌కు అందించారు.

ధనవంతుడిని చేస్తానని దోచేసింది

- ఆన్‌లైన్‌లో అమ్మాయి వల
- రూ.15 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

రాజానగరం: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, మోసగాళ్ల బారిన చాలామంది పడుతూనే ఉన్నారు. మండలంలోని శ్రీకృష్ణపట్నంలో జరిగిన ఈ ఘటనే దీనికి నిదర్శనం. 'నిన్ను ధనవంతుడి'ని చేస్తానంటే నమ్మిన ఓ రైతు రూ.14,95,135లు పోగొట్టుకున్నాడు. ఎస్సై నాగార్జున శనివారం ఇక్కడ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లాం బాబు అనే రైతుకు ఫేస్‌బుక్‌లో ఒక అమ్మాయి పరిచయమైంది. క్రమేపీ ఇద్దరి మధ్య చాటింగ్‌లు పెరిగాయి. ఈ క్రమంలో నిన్ను ధనవంతుడిని చేస్తానని ఆ అమ్మాయి చెపితే నమ్మేశాడు. తన పేరుతో ఒక మెయిల్ ఐడీ అకౌంట్‌ని ఓపెన్ చేసి, ఆమె పంపించిన వెబ్‌సైట్‌కి లింక్ చేశాడు. అందులో తన పేరుతో ఉన్న అన్ని బ్యాంకు అకౌంట్ల నంబర్లు ఎంటర్ చేశాడు. అనంతరం ఆ అమ్మాయి చెప్పిన నంబరుకు రూ.50 వేలు చొప్పున దఫదఫాలుగా రూ.14,95,135 ఫోన్‌పే చేశాడు. ఇంకేముంది అతడి బ్యాంకు ఖాతాలో 59,093.57 డాలర్లు క్రెడిట్ అయినట్టుగా వాట్సాప్ మెసేజ్ పంపించింది. దాన్ని నమ్మిన అతను విత్ డ్రా చేద్దామని ప్రయత్నిస్తే కాలేదు. అదే విషయాన్ని ఆమెకు తెలియజేస్తే, మీ అకౌంట్ ఫ్రీజ్ అయిదని, అది తిరిగి ఓపెన్ కావాలంటే మరో రూ.20 లక్షలు పంపించాలని చెప్పిన ఆమె ఆ తరువాత అతనికి కాంటాక్టులో లేకుండా పోయింది. తన నంబరును బ్లాక్ చేయడంతో ఆమెకు ఫోన్ వెళ్లడం లేదు. దీనితో తాను మోసపోయానని గ్రహించిన కొల్లాం బాబు రాజానగరం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగార్జున తెలిపారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.